# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 | సంచిక : 191 | మంగళవారం 17, మార్చి 2026 | పేజీలు: 07 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com



02


## డ్రగ్ టెస్టులు తప్పనిసరి చేయాలి

రాజకీయాలు, సినిమా రంగంలో అమలవ్వాలి
కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి డిమాండ్
పైలట్ రోహిత్ రెడ్డి ఘటనతో కలకలం
డ్రగ్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సూచనలు
ప్రజాప్రతినిధులకు తప్పనిసరి టెస్టులపై వినతి
సినీ తారలు కూడా పరీక్షలు చేయించుకోవాలని పిలుపు
లేదంటే సినిమా విడుదలకు అనుమతి ఇవ్వొద్దని డిమాండ్

## నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

**2025వ సంవత్సరానికి పురస్కారాలు ప్రకటించిన కేంద్రం**

దేశంలోని 24 భాషల్లో ఉత్తమ రచనలకు సాహిత్య అవార్డులు
కరోనా కాలపు సామాజిక పరిస్థితులను ప్రతిబింబించిన 'అనిమేష'కు గుర్తింపు
మార్చి 31న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డుల ప్రదానం
విజేతలకు తామ్రపత్రం, శాలువా, లక్ష రూపాయల నగదు బహుమతి
కవిత్వం, నవలలు, కథలు, వ్యాసాలు సహా పలు ప్రక్రియలకు అవార్డులు
తెలుగు సాహిత్యంలో ప్రత్యేక ముద్ర వేసిన రచయితకు మరో ఘనత


06



## ప్రపంచ దిక్సూచిగా తెలంగాణ

### తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన గవర్నర్

అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం
బడ్జెట్ సమావేశాలు ప్రారంభం
20 ఏళ్లలో 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ
హైదరాబాద్ అభివృద్ధికి జీహెచ్ఎంసీని విభజన
మూసీ నది పునరుద్ధరణకు 55 కి.మీ. అభివృద్ధి ప్రణాళిక
రైతు భరోసా ద్వారా 65 లక్షల మంది రైతులకు ప్రయోజనం
పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. సమావేశాలు తెలంగాణ రాష్ట్ర గీతంతో ప్రారంభమయ్యాయి. అనంతరం వందేమాతరం, తర్వాత జాతీయ గీతం జనగణమన ఆలపించారు. ఆ తర్వాత గవర్నర్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తెలుగులోనే తన ప్రసంగాన్ని ప్రారంభించిన గవర్నర్ రాష్ట్ర చరిత్ర, అభివృద్ధి, ప్రభుత్వ విధానాలపై విస్తృతంగా మాట్లాడారు.తెలంగాణ రాష్ట్రం సుదీర్ఘ చారిత్రాత్మక పోరాటాల ఫలితంగా ఏర్పడిందని ..మిగతా 2లో

## భవిష్యత్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

### ప్రజా ప్రభుత్వ 3వ బడ్జెట్‌కు గవర్నర్ ప్రసంగమే మార్గదర్శకం

గత ప్రభుత్వాలపై చర్చించాలన్న సీఎం రేవంత్ రెడ్డి
ప్రజా ప్రభుత్వ 3వ బడ్జెట్‌కు గవర్నర్ ప్రసంగమే మార్గదర్శకం
అసెంబ్లీ సమావేశాల వ్యూహంపై కాంగ్రెస్ సమావేశంలో చర్చ
చర్చలు పక్కదారి పడకుండా ముందుకు వెళ్లాలని సూచన
ఎమ్మెల్యేలు సభకు తప్పకుండా హాజరు కావాలని హెచ్చరిక
మహిళా సభ్యులు చర్చల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపు
ఇతర రాష్ట్రాల విధానాలు అధ్యయనం చేయాలని సూచన
వేసవి తాగునీటి సమస్యపై ప్రజల మధ్య పనిచేయాలని ఆదేశం



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ శాసనసభా పక్షం కీలక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పలు సూచనలు చేశారు. గత ప్రభుత్వాల వైఫల్యాల గురించి మాట్లాడటానికి ఒక హద్దు ఉంటుందని, ఇక నుంచి రాష్ట్ర భవిష్యత్తు అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయం వచ్చిందని ఆయన అన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేయబోయే పనులు, అభివృద్ధి ప్రణాళికలపై సభ్యులు ఎక్కువగా మాట్లాడాలని సూచించారు.శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన ..మిగతా 2లో

## పశ్చిమాసియా ఉద్రిక్తతలు.. కేంద్రంపై కాంగ్రెస్ విమర్శలు

బ్రిక్స్ వేదికగా భారత్ స్పందనపై రాజకీయ దుమారం
బ్రిక్స్ అధ్యక్షదేశంగా సమష్టి ప్రకటన చేయలేదన్న కాంగ్రెస్
అమెరికా, ఇజ్రాయెల్‌తో సంబంధాల కోసమే మౌనమని ఆరోపణ
పశ్చిమాసియా ఉద్రిక్తతలపై దౌత్య మార్గాలే పరిష్కారమని వెల్లడి
ఇరాన్‌పై దాడుల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలు
పార్లమెంట్‌లో పూర్తి స్థాయి చర్చ జరపాలని కాంగ్రెస్ డిమాండ్
విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రకటనపై ప్రతిపక్ష అసంతృప్తి


06


02

## ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత ఎక్కడ?

### "తెలంగాణను ఏటీఎంగా మార్చారు"

కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్ మోసం చేస్తోందని ఆరోపణ
100 రోజుల్లో హామీలని రెండున్నరేళ్లు గడిచాయని విమర్శ
రైతుబంధు, రైతుభరోసా అమలు కాకపోవడంపై అసంతృప్తి
బలహీన వర్గాల బడ్జెట్, దళిత హామీలపై స్పష్టత లేదని వ్యాఖ్య
మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగుల హామీలపై ప్రశ్నలు
అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరిక



## అసెంబ్లీ వారం రోజులు కూడా నడవదు

అసెంబ్లీ షెడ్యూల్‌పై హరీష్ రావు విమర్శలు
పండుగలతో పనిదినాలు తగ్గాయని ఆరోపణ
బడ్జెట్ చర్చకు సమయం సరిపోదన్న అభిప్రాయం
ఆదివారం సభకు తమకు అభ్యంతరం లేదన్న హరీష్ రావు

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల నిర్వహణ తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్‌లో పనిదినాలు చాలా తక్కువగా ఉన్నాయని, ఇది ప్రజా సమస్యలపై చర్చను నీరుగార్చడమేనని ఆయన ఆరోపించారు. ఈ నెల 30వ తేదీ వరకు సమావేశాలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వాస్తవానికి సభ నడిచేది వారం రోజులు కూడా ఉండదని హరీష్ రావు పేర్కొన్నారు. సమావేశాల మధ్యలో ఉగాది, రంజాన్, శ్రీరామనవమి వంటి పండుగలతో పాటు రెండు ఆదివారాలు వస్తున్నాయని, ఆ ఐదు సెలవు దినాలను మినహాయిస్తే చర్చకు చాలా తక్కువ సమయం మిగులుతుందని ఆయన గణాంకాలతో సహా వివరించారు. సమావేశాల అజెండాపై క్లారిటీ ఇస్తూ, మార్చి 17 , 18 తేదీలలో గవర్నర్ ప్రసంగంపై చర్చ జరుగుతుందని, ఆ తర్వాత మార్చి 20వ తేదీన ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతుందని ఆయన వెల్లడించారు. అయితే, బడ్జెట్ వంటి కీలక అంశంపై సమగ్రంగా చర్చించే అవకాశం లేకుండా ప్రభుత్వం షెడ్యూల్‌ను కుదించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పండుగ సెలవుల వల్ల తగ్గిన పనిదినాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం మార్చి 29వ తేదీ ఆదివారం నాడు కూడా సభను ..మిగతా 2లో

# భవిష్యత్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

**మొదటిపేజీ తరువాయి**

వేం నరేందర్ రెడ్డిని ఈ సందర్భంగా సీఎల్పీ సభ్యులు అభినందించారు. అనంతరం అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ముఖ్యమంత్రి సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రెండు బడ్జెట్లు ప్రవేశ పెట్టిందని గుర్తుచేశారు. ఇప్పుడు మూడో బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో గవర్నర్ చేసిన ప్రసంగం ప్రభుత్వానికి మార్గదర్శకంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, భవిష్యత్ ప్రణాళికలు, అమలు చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు గవర్నర్ ప్రసంగంలో స్పష్టంగా వివరించబడ్డాయని ఆయన పేర్కొన్నారు. అందువల్ల సభ్యులు కూడా ఆ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చలు సమర్థవంతంగా సాగేందుకు పార్టీ సభ్యుల మధ్య సమన్వయం అవసరమని సీఎం అన్నారు. ముఖ్యంగా సభలో మాట్లాడే అంశాలపై విప్‌లతో ముందుగానే చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సభ్యులు మాట్లాడే విషయాలు పక్కదారి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సభ సమయాన్ని వృథా చేయకుండా నిర్మాణాత్మక చర్చలు జరగాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమకు ఎదురైన అనుభవాలను కూడా సీఎం గుర్తు చేశారు. గతంలో ప్రతిపక్ష సభ్యులకు సభలో మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదని ఆయన అన్నారు. సీఎల్పీ నేతగా ఉన్న భట్టి విక్రమార్కకు కూడా మాట్లాడే అవకాశం ఇవ్వలేదని చెప్పారు. జానారెడ్డి వంటి సీనియర్ నాయకులకు కూడా మైక్ ఇవ్వకుండా సభ నిర్వహించిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. తనను కూడా ఒక సెషన్ మొత్తం సస్పెండ్ చేసి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సభకు రాకుండా చేసిన సంఘటనలను ఆయన ప్రస్తావించారు.అలాంటి పరిస్థితులు ఇప్పుడు ఉండకూడదని సీఎం అన్నారు. ప్రజాస్వామ్య విధానాలను గౌరవిస్తూ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. సభలో ప్రతిపక్షం కూడా మాట్లాడే అవకాశం పొందాలని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే సభలో చర్చలు సజావుగా సాగేందుకు సభ్యులు కూడా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

అసెంబ్లీ సమావేశాల హాజరు విషయంలో ఎమ్మెల్యేలు నిర్లక్ష్యం వహించకూడదని సీఎం హెచ్చరించారు. ప్రతి సభ్యుడు సభకు హాజరై చర్చల్లో పాల్గొనాలని అన్నారు. ముఖ్యంగా మహిళా శాసనసభ్యులు కూడా చర్చల్లో చురుకుగా పాల్గొనాలని ఆయన సూచించారు. మహిళా సభ్యుల అభిప్రాయాలు సభలో ప్రతిఫలించడం అవసరమని పేర్కొన్నారు. ప్రజలకు సంబంధించిన అనేక సమస్యలపై మహిళా సభ్యులు తమ అభిప్రాయాలను తెలియజేయాలని అన్నారు. అసెంబ్లీ కమిటీల ఏర్పాటు గురించి కూడా సీఎం మాట్లాడారు. శాసనసభ కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి వాటి ద్వారా ప్రజా సమస్యలను అధ్యయనం చేయాలని సూచించారు. కమిటీల ద్వారా ప్రభుత్వ విధానాల అమలును పరిశీలించవచ్చని చెప్పారు. అదే విధంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర రాష్ట్రాలను సందర్శించి అక్కడ అమలవుతున్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో అమలు అవుతున్న మంచి కార్యక్రమాలను తెలంగాణలో కూడా అమలు చేసే అవకాశం ఉంటుందని చెప్పారు.

రాజకీయాల్లో వ్యక్తిగత విమర్శలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదని సీఎం అన్నారు. ఒక వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం కన్నా వ్యవస్థను బలపర్చడం ముఖ్యం అని చెప్పారు. వ్యక్తిగత విమర్శలు రాజకీయ వ్యవస్థను దెబ్బతీస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. వ్యవస్థ బలంగా ఉంటేనే ప్రజాస్వామ్యం నిలుస్తుందని అన్నారు. పార్టీ మరియు ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా సభ్యులు స్పందించాలని సీఎం సూచించారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ పనితీరును వివరించాలని సూచించారు.

ఇప్పుడు ప్రభుత్వం రూపొందిస్తున్న అభివృద్ధి ప్రణాళికలు భవిష్యత్తు ఎన్నికలకు కూడా కీలకంగా మారతాయని సీఎం అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రూపొందిస్తున్న రోడ్ మ్యాప్‌నే వచ్చే ఎన్నికల్లో ప్రజల ముందుంచాల్సి ఉంటుందని చెప్పారు. అందువల్ల ప్రతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.వేసవి కాలం నేపథ్యంలో తాగునీటి సమస్యపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సీఎం సభ్యులకు సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా స్థానికంగా పరిస్థితులను పరిశీలించాలని సూచించారు.

ప్రభుత్వం ప్రకటించిన 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజలతో కలిసిమెలిసి పనిచేయాలని సూచించారు.మొత్తంగా ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రభుత్వ విధానాల ప్రచారం వంటి అంశాలపైసభ్యులుదృష్టిపెట్టాలనిసీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు.

# “ప్రపంచ దిక్సూచిగా తెలంగాణ”

**మొదటిపేజీ తరువాయి**

గవర్నర్ గుర్తుచేశారు. ఈ రాష్ట్ర నిర్మాణం కోసం అనేక మంది ప్రజలు త్యాగాలు చేశారని అన్నారు. ఆ త్యాగాలను గౌరవించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ప్రజా పాలన స్ఫూర్తితో రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు.

రాష్ట్రంలోని ప్రతి వర్గానికి అభివృద్ధి ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని గవర్నర్ తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సమాన అవకాశాలు అనే మూడు ప్రధాన లక్ష్యాలతో పరిపాలన సాగుతోందని అన్నారు. తెలంగాణను దేశంలోనే కాకుండా ప్రపంచంలో కూడా గుర్తింపు పొందే రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని గవర్నర్ వివరించారు. అలాగే 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్లకు చేర్చే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఈ లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం పలు రంగాల్లో సంస్కరణలు చేపడుతోందని చెప్పారు. గత సంవత్సరం కాలంలో ప్రభుత్వం అనేక కీలక సంస్కరణలు చేపట్టిందని గవర్నర్ గుర్తుచేశారు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి పునాదులు వేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికీ గౌరవప్రదమైన జీవితం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు.

హైదరాబాద్ నగర అభివృద్ధిపై కూడా గవర్నర్ తన ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించామని తెలిపారు. ఇది పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి తీసుకున్న నిర్ణయం అని చెప్పారు.పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా నగరం మధ్యలో ఉన్న పరిశ్రమలను నగర శివార్లకు తరలించే చర్యలు తీసుకుంటున్నామని గవర్నర్ తెలిపారు. ఇందుకోసం హిల్ట్ పాలసీని ప్రభుత్వం తీసుకువచ్చిందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు విభాగాలుగా అభివృద్ధి ప్రణాళికను రూపొందించామని వివరించారు.

రోడ్ల అభివృద్ధిపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని గవర్నర్ చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్‌కు అనుసంధానంగా రేడియల్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ మరియు రీజినల్ రింగ్ రోడ్ మధ్య అనుసంధానం కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు.అలాగే తెలంగాణను ఇతర రాష్ట్రాలతో అనుసంధానం చేసే రహదారుల నిర్మాణం కూడా జరుగుతోందని గవర్నర్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతితో కనెక్టివిటీ కల్పించేలా గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. దీనివల్ల రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని తెలిపారు.

శంషాబాద్‌ను బుల్లెట్ ట్రైన్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే ఆలోచన కూడా ప్రభుత్వానికి ఉందని గవర్నర్ చెప్పారు. రాష్ట్రంలో విమానయాన రంగాన్ని అభివృద్ధి చేయడానికి వరంగల్ మరియు ఆదిలాబాద్ ప్రాంతాల్లో కొత్త విమానాశ్రయాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.హైదరాబాద్ పరిసరాల్లో అభివృద్ధి చెందుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును కూడా గవర్నర్ ప్రస్తావించారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రత్యేక అథారిటీని గత సంవత్సరం మార్చి నెలలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ప్రాంతాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.

మూసీ నది అభివృద్ధి ప్రణాళికను కూడా గవర్నర్ వివరించారు. హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు సుమారు 55 కిలోమీటర్ల మేర మూసీ నది పునరుద్ధరణ చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా నదిని శుభ్రపరచడం, పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు.రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడేందుకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుందని గవర్నర్ అన్నారు. ప్రజలకు భద్రత కల్పించేందుకు నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేశామని తెలిపారు.



సామాజిక న్యాయం అంశంపై కూడా గవర్నర్ ప్రస్తావించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పలు చర్యలు తీసుకుందని చెప్పారు. బీసీల జనాభా వివరాలను తెలుసుకునేందుకు కులగణన సర్వే నిర్వహించామని తెలిపారు. ఈ వివరాల ఆధారంగా బీసీలకు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా చట్టం రూపొందించామని చెప్పారు.అదే విధంగా ఎస్సీ వర్గీకరణ అంశంలో కూడా ప్రభుత్వం చట్టం తీసుకువచ్చిందని గవర్నర్ తెలిపారు. ఎస్సీల్లోని వివిధ ఉప కులాలకు సమాన న్యాయం జరిగేలా ఈ చట్టం రూపొందించామని చెప్పారు. ఈ విషయంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు.

వ్యవసాయ రంగంలో కూడా తెలంగాణ రాష్ట్రం మంచి పురోగతి సాధించిందని గవర్నర్ అన్నారు. రాష్ట్రంలో 236 లక్షల టన్నుల వరి ఉత్పత్తి సాధించామని తెలిపారు. దీంతో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని చెప్పారు.రైతు భరోసా పథకం ద్వారా రైతులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని గవర్నర్ తెలిపారు. తొమ్మిది రోజుల్లోనే ఎనిమిది వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా సుమారు 65 లక్షల మంది రైతులు లబ్ధి పొందారని వివరించారు.

పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని గవర్నర్ చెప్పారు. రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యాన్ని ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. ఇప్పటివరకు 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు వివరించారు.పేదలకు గృహ వసతి కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని గవర్నర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో వేల సంఖ్యలో ఇళ్ల నిర్మాణం జరుగుతోందని వివరించారు.ఇదిలా ఉండగా అసెంబ్లీ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అసెంబ్లీకి చేరుకున్నప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆయనకు స్వాగతం పలికారు.

ఆ తర్వాత గవర్నర్, ముఖ్యమంత్రి మరియు మంత్రులు కలిసి మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పునరుద్ధరించిన కౌన్సిల్ భవనం ముందు ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని గవర్నర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అయితే ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ పార్టీ సభ్యులు బహిష్కరించారు.మొత్తంగా తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజే రాష్ట్ర అభివృద్ధి, ప్రభుత్వ ప్రణాళికలు, భవిష్యత్ లక్ష్యాలపై గవర్నర్ చేసిన ప్రసంగం రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యతను సంతరించుకుంది.

# అసెంబ్లీ వారం రోజులు కూడా నడవదు

**మొదటిపేజీ తరువాయి**

నిర్వహించాలని భావిస్తోంది.

దీనిపై స్పందించిన హరీష్ రావు, ఆదివారం నాడు సభ పెట్టినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. తమకు కావాల్సింది కేవలం చర్చకు తగిన సమయం మాత్రమేనని, ప్రజల పక్షాన గళం వినిపించేందుకు తాము ఎప్పుడూ సిద్ధమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించి బడ్జెట్‌ను ఆమోదింపజేసుకోవాలని చూస్తోందని, దీనివల్ల ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతింటుందని ఆయన విమర్శించారు.



# ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత ఎక్కడ?

- **“తెలంగాణను ఏటీఎంగా మార్చారు”**
- **కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు**
- **ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్ మోసం చేస్తోందని ఆరోపణ**
- **100 రోజుల్లో హామీలని రెండున్నరేళ్లు గడిచాయని విమర్శ**
- **రైతుబంధు, రైతుభరోసా అమలు కాకపోవడంపై అసంతృప్తి**
- **బలహీన వర్గాల బడ్జెట్, దళిత హామీలపై స్పష్టత లేదని వ్యాఖ్య**
- **మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగుల హామీలపై ప్రశ్నలు**
- **అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరిక**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణను అభివృద్ధి దిశగా నడిపించాల్సిన ప్రభుత్వం రాష్ట్రాన్ని ఒక “ఏటీఎం”గా మార్చి ఏఐసీసీకి సమర్పిస్తున్నదని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలోని పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వానికి సరైన శ్రద్ధ లేదని విమర్శించారు. రాష్ట్రంలోని ప్రతి పేద మనిషి తరపున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని, శాసనసభలో ఈ అంశాలపై గట్టిగా నిలదీస్తామని ఆయన హెచ్చరించారు.

తెలంగాణ అసెంబ్లీ మరియు శాసన మండలి సమావేశాలు ప్రారంభం కావడంతో ముందు గన్‌పార్క్ వద్ద తెలంగాణ అమరవీరులకు కేటీఆర్ నివాళులు అర్పించారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ వారికి ఘనంగా నివాళులు సమర్పించారు. విద్యార్థి అమరవీరుల త్యాగం వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఆయన అన్నారు. వారి ఆశయాలను స్మరించుకుంటూ శాసనసభ సమావేశాలకు హాజరవుతున్నామని చెప్పారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ముఖ్యంగా ఆరు గ్యారెంటీల అమలుపై ప్రజలకు పెద్ద ఎత్తున హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయకపోవడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ నాయకులు 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. అంతేకాదు ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మొదటి క్యాబినెట్ సమావేశంలో వాటికి చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పారని తెలిపారు. అయితే ఇప్పుడు రెండున్నర సంవత్సరాలు గడిచినా ఆ హామీలు అమలు కాలేదని విమర్శించారు.

గతంలో గవర్నర్ ప్రసంగంలో కూడా ఈ హామీల గురించి ప్రభుత్వం ప్రకటించిందని కేటీఆర్ గుర్తు చేశారు. అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రసంగంలో కూడా ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని పేర్కొన్నారని అన్నారు. ముఖ్యమంత్రి సంతకం చేసిన ఆ ప్రసంగంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు స్పష్టంగా ఉన్నాయని చెప్పారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఆ హామీలకు చట్టబద్ధత ఇవ్వలేదని విమర్శించారు. ప్రస్తుతం ఇది మూడో గవర్నర్ ప్రసంగం అయినప్పటికీ ఇప్పటికీ ఆరు గ్యారెంటీల అమలుపై ఎలాంటి స్పష్టత లేదని కేటీఆర్ అన్నారు.

రైతుల పరిస్థితి గురించి మాట్లాడుతూ కేటీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం కాలంలో రైతులకు పంటలు నాటే సమయానికి రైతుబంధు నిధులు అందేవని చెప్పారు. అయితే ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయిందని విమర్శించారు. ఇప్పుడు పంటలు కోతలకు వచ్చినా రైతుబంధు డబ్బులు రైతులకు అందడం లేదని అన్నారు. రైతులకు ఎప్పుడు నిధులు అందిస్తారో ప్రభుత్వం స్పష్టంగా చెప్పడం లేదని విమర్శించారు.

ఈ నేపథ్యంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీస్తామని కేటీఆర్ తెలిపారు. “రాహుల్ బంధు కాదు, రైతుబంధు ఇవ్వాలి” అంటూ ఆయన వ్యాఖ్యానించారు. రైతులకు సహాయం చేయాల్సిన ప్రభుత్వం వేరే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# డ్రగ్ టెస్టులు తప్పనిసరి చేయాలి

- **రాజకీయాలు, సినిమా రంగంలో అమలవ్వాలి**
- **కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి డిమాండ్**
- **పైలట్ రోహిత్ రెడ్డి ఘటనతో కలకలం**
- **డ్రగ్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సూచనలు**
- **ప్రజాప్రతినిధులకు తప్పనిసరి టెస్టులపై వినతి**
- **సినీ తారలు కూడా పరీక్షలు చేయించుకోవాలని పిలుపు**
- **లేదంటే సినిమా విడుదలకు అనుమతి ఇవ్వొద్దని డిమాండ్**
- **రాజకీయంగా చర్చకు దారి తీస్తున్న డ్రగ్స్ వ్యవహారం**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన ఒక ఘటనతో ఈ విషయం రాజకీయాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి డ్రగ్స్ కేసులో పోలీసులకు పట్టుబడినట్లు వెలుగులోకి రావడంతో రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చ మొదలైంది. ఈ ఘటనతో రాజకీయ వర్గాల్లో తీవ్ర స్పందనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా డ్రగ్స్ వినియోగంపై ప్రభుత్వ వైఖరి, రాజకీయ నాయకుల పాత్ర వంటి అంశాలు ఇప్పుడు ప్రధాన చర్చగా మారాయి.ఈ ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత రాజకీయ నాయకులు కూడా స్పందిస్తున్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి డ్రగ్స్ వ్యవహారంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మీడియాతో జరిగిన అనౌపచారిక సంభాషణలో ఆయన ఈ విషయంపై తన అభిప్రాయాలను వెల్లడించారు. డ్రగ్స్ సమస్య కేవలం రాజకీయాలకు మాత్రమే పరిమితం కాకుండా సమాజంలోని పలు రంగాల్లో వ్యాపించిందని ఆయన అన్నారు. ముఖ్యంగా సినిమా పరిశ్రమలో డ్రగ్స్ ప్రభావం ఎక్కువగా ఉందని వ్యాఖ్యానించారు. సమాజంలో డ్రగ్స్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించాలంటే కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అనిరుధ్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రజాప్రతినిధులు కూడా ఈ విషయంలో ఆదర్శంగా ఉండాలని అన్నారు. అందుకే ప్రజాప్రతినిధులకు నిర్దిష్ట వ్యవధిలో డ్రగ్స్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజా జీవనంలో ఉన్న ప్రముఖులు డ్రగ్స్ వినియోగం నుంచి పూర్తిగా దూరంగా ఉండాలని ఆయన అన్నారు.అదే సమయంలో సినిమా రంగానికి కూడా ఈ నిబంధనలు వర్తించాలనే అభిప్రాయం వ్యక్తం చేశారు. సినీ నటులు, దర్శకులు, నిర్మాతలు, ఇతర ప్రముఖులు కూడా నిర్దిష్ట కాల వ్యవధిలో డ్రగ్స్ పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. ప్రతి 90 రోజులకు ఒకసారి డ్రగ్స్ టెస్ట్ చేయించే విధంగా నిబంధనలు తీసుకురావాలని అన్నారు. ఇది అమలులోకి వస్తే డ్రగ్స్ వినియోగాన్ని కొంతవరకు నియంత్రించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

సినిమా రంగంలో పనిచేసే ప్రముఖులకు డ్రగ్స్ పరీక్షలు తప్పనిసరి చేస్తే పరిస్థితి మారుతుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఒక సినిమా విడుదలకు ముందు అందులో పనిచేసిన ముఖ్య వ్యక్తులు డ్రగ్స్ టెస్ట్ చేయించుకోవాలనే నిబంధన ఉండాలని అన్నారు. ఆ పరీక్షలు పూర్తి చేసిన తర్వాతే సినిమాలకు విడుదల అనుమతి ఇవ్వాలని సూచించారు. పరీక్షలు చేయించుకోకుండా సినిమాలు విడుదల చేయకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని అన్నారు. ఇదే విధంగా ప్రజాప్రతినిధుల విషయంలో కూడా కఠిన నిబంధనలు ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వంటి ప్రజాప్రతినిధులు డ్రగ్స్ పరీక్షలు చేయించుకోకపోతే ప్రజల్లో అనుమానాలు కలుగుతాయని చెప్పారు. ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన నాయకులు డ్రగ్స్ వినియోగంపై స్పష్టమైన సందేశం ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. డ్రగ్స్ పరీక్షలు చేయించుకోని ప్రజాప్రతినిధులను అసెంబ్లీకి అనుమతించకూడదని కూడా ఆయన అభిప్రాయపడ్డారు.

ఇదిలా ఉండగా బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి డ్రగ్స్ కేసులో పట్టుబడిన ఘటన రాజకీయంగా పెద్ద చర్చకు దారి తీసింది. పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని విచారణ నిర్వహించినట్లు సమాచారం. అనంతరం ఆయనను రిమాండ్‌కు పంపినట్లు తెలిసింది. ఈ ఘటనతో రాజకీయ వర్గాల్లో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.గతంలో కూడా తెలంగాణలో డ్రగ్స్ వ్యవహారం పలు సందర్భాల్లో చర్చకు వచ్చింది. అప్పటి నుంచి ఈ సమస్యపై వివిధ రాజకీయ పార్టీలు ఒకదానిపై ఒకటి ఆరోపణలు చేసుకుంటూ వచ్చాయి. ముఖ్యంగా గత ప్రభుత్వ కాలంలో డ్రగ్స్ వినియోగం పెరిగిందని కొందరు నాయకులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలను అప్పటి ప్రభుత్వం ఖండించింది.



ఇప్పుడు ఈ తాజా ఘటనతో మళ్లీ డ్రగ్స్ వ్యవహారం రాజకీయ చర్చగా మారింది. ముఖ్యంగా బీఆర్ఎస్ నాయకులపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఆ పార్టీపై ఒత్తిడి పెరుగుతోంది. మరోవైపు కాంగ్రెస్ నాయకులు డ్రగ్స్ విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టాలంటే కేవలం చట్టపరమైన చర్యలు మాత్రమే కాకుండా సామాజిక అవగాహన కూడా అవసరమని నిపుణులు చెబుతున్నారు. యువతలో పెరుగుతున్న డ్రగ్స్ వినియోగాన్ని నియంత్రించడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.

# రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేసిన రాఘవేందర్ గౌడ్

**మేడ్చల్,(ప్రజాస్వరం):**

రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకొని రంజాన్ పండుగ రాను ఉండడంతో ముస్లిం పేద కుటుంబాలకు తోఫా పంపిణీ చేయడం ఎంత సంతృప్తిగా ఉందని ఆర్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, మేడ్చల్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రామన్నగారి రాఘవేందర్ గౌడ్ అన్నారు. రంజాన్ పండుగ నేపథ్యంలో సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ మేడ్చల్ డివిజన్ పరిధిలోని గిర్మాపూర్, రాయిలాపూర్ గ్రామాలలో ఉన్నటువంటి పేద ముస్లిం కుటుంబాలకు సుమారు 250 రంజాన్ తోఫా కిట్లను స్థానిక నాయకులుతో కలిసి రామన్నగారి రాఘవేందర్ గౌడ్ ఆదివారం పంపిణీ చేశారు. ముస్లింలు రంజాన్ ఉపవాసాలను అనుసరిస్తూ పండుగను పవిత్రంగా జరుపుకుంటారని అన్నారు. తన వంతు సహాయంగా ప్రతి ముస్లిం కుటుంబాలు రంజాన్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఉద్దేశంతో తోఫా కిట్లను అందజేస్తున్నట్లు రామన్నగారి రాఘవేందర్ గౌడ్ చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లయక్ అలీ, పాషా, ఇజాక్, సాబీర్, జావేద్, రఫిక్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.





# తెలంగాణ సివిల్ సర్వీసెస్ వాలీబాల్ జట్టుకు ఎంపికైన వార్డ్ ఆఫీసర్ రాజుబాబు

**మేడ్చల్, (ప్రజాస్వరం):**

మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని 6 వార్డు రాజబొల్లారం గ్రామానికి చెందిన పిల్లి బిక్షపతి & జయమ్మ ల కుమారుడు పిల్లి రాజుబాబు తెలంగాణ సివిల్ సర్వీసెస్ వాలీబాల్ జట్టుకు ఎంపిక అయ్యాడు. ఈ నెల 20 నుండి 25 వరకు ఢిల్లీలో జరిగే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ వాలీబాల్ టోర్నమెంట్లో తెలంగాణ జట్టు తరపున ప్రతినిత్యం వహిస్తున్నాడు. ఈ సందర్భంగా రాజబొల్లారం గ్రామానికి పేరు తీసుకు వచ్చిన రాజుబాబును గ్రామస్తులు,నాయకులు అభినందించారు. ప్రస్తుతం రాజుబాబు CMC లో కుత్బుల్లాపూర్ జోన్ లోని మేడ్చల్ సర్కిల్ 60 లో వార్డ్ ఆఫీసర్ గా నిధులు నిర్వహిస్తున్నారు.



# మహిళా సంఘ భవనానికి పూజలు

**మాసాయిపేట మార్చి 16 (ప్రజాస్వరం)**

మండలం రామంతపూర్లో నూతనంగా నిర్మిస్తున్న మహిళా సంఘ భవనానికి సోమవారం గడప ఏర్పాటు పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ భవాని సౌందర్య రఘుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో ఉప సర్పంచ్ విజయ సంతోష్ రెడ్డి, కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు. మహిళల సాధికారతకు ఈ భవనం వేదికగా నిలుస్తుందని సర్పంచ్ పేర్కొన్నారు



# మేడ్చల్ జిల్లాలో తాగునీటి సమస్యపై బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం....

**మేడ్చల్, (ప్రజాస్వరం):**

జీహెచ్ఎంసీ పరిధిలోని 297, 298 డివిజన్లలో మేడ్చల్, పూడూరు, కిష్టాపూర్ ప్రాంతాల్లో ప్రజలు తాగునీరు,మురికి కాలువలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మేడ్చల్ బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సమస్యను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు సరైన పరిష్కారం చూపలేదని మండిపడ్డారు. గత తెలంగాణ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు తాగునీరు ఎప్పుడూ అందుబాటులో ఉండేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన మొదటినుంచి పట్టణ ప్రజలకు నీటి సమస్యలు మొదలయ్యాయి అన్నారు. పట్టణ చుట్టుపక్కల గ్రామాల్లో అవసరానికి మించి నీటి సరఫరా జరుగుతుంది కేవలం మేడ్చల్ పట్టణానికే ఈ సమస్య ఎందుకు వొస్తుంది అని ప్రశ్నించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఖాళీ బిందెలతో పాదయాత్రగా వచ్చి అసెంబ్లీని ముట్టడిస్తామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నవీన్ రెడ్డి,విష్ణు చారి, దయనంద్ యాదవ్ లు పాల్గొన్నారు.



# అంబేద్కర్ విగ్రహ... గద్దె కూల్చడం దురదృష్టకరం

- **యువతపై నమోదు చేసిన కేసులు వెంటనే ఎత్తివేయాలి**
- **అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు అధికారులు అనుమతి ఇవ్వాలి**

**గజ్వేల్ మార్చి 16 (ప్రజాస్వారం ):**

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అందరివాడని, ఆయన విగ్రహ ఏర్పాటుతో ఎవరికి ఎలాంటి ఇబ్బంది ఉండదని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ పేర్కొన్నారు. వర్గల్ మండలం నాచారం వద్ద అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం నిర్మించిన గద్దె కూల్చిన ప్రాంతాన్ని సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అట్టడుగున నిలిచిన ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బిసి వర్గాల అభ్యున్నతికి కృషి చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా చిన్న రాష్ట్రాల ఏర్పాటుతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని స్పష్టం చేయగా, అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినట్లు చెప్పారు. అయితే అందరి ఆరాధ్యదైవమైన అంబేద్కర్ విగ్రహ ఏర్పాటును అడ్డుకోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గద్దె నిర్మాణ నిర్వాహకులపై పోలీసులు కేసులు నమోదు చేయడం భావ్యం కాదని పేర్కొంటూ రహదారికి సమీపంలో విగ్రహ ఏర్పాటును స్వాగతిస్తూ సంబంధిత అధికారులు అనుమతి ఇవ్వాలని కోరారు. సున్నితమైన ఇలాంటి అంశాన్ని ఏకపక్ష నిర్ణయాలతో పరిష్కరించలేరని, అన్ని వర్గాలతో చర్చించి వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ విషయంపై యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు త్వరితగతిన స్పందించి చర్యలు చేపట్టాలని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దండుగళ్ల కిషన్, జిల్లా అధ్యక్షులు ముకద్దం సుధాకర్, నాచారం అంబేద్కర్ సంఘం అధ్యక్షులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

- **మహిళ భుజం నుండి 750 గ్రాముల ట్యూమర్ తొలగింపు**
- **ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ**

**గజ్వేల్, 16 మార్చి (ప్రజాస్వరం) :**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి వైద్యులు మరోసారి తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. ఆర్థిక స్థోమత లేక ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించలేని నిరుపేద రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలిచారు. గజ్వేల్ పట్టణానికి చెందిన జ్యోతి (32) భర్త హనుమంతు అనే మహిళ గత కొంత కాలంగా కుడి భుజంపై పెద్ద కణితి (ట్యూమర్) సమస్యతో బాధపడుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన ఆమె, ప్రైవేట్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకునే స్తోమత లేక గజ్వేల్ జిల్లా ఆసుపత్రిని ఆశ్రయించారు. రోగి పరిస్థితిని గమనించిన వైద్యులు వెంటనే అవసరమైన పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. ఒక బృందంగా ఏర్పడిన వైద్యులు సుమారు 750 గ్రాముల బరువున్న భారీ ట్యూమర్‌ను (నియోప్లాజమ్) విజయవంతంగా తొలగించారు. ప్రస్తుతం బాధితురాలు కోలుకుంటున్నారని, ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ, "పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే మా లక్ష్యం. శరీరంలోని కణాలు అసాధారణంగా పెరగడం వల్ల డీఎన్ఏ మార్పులు, రేడియేషన్ లేదా జన్యుపరమైన కారణాలతో ఇటువంటి ట్యూమర్లు ఏర్పడతాయి. శరీరంలో ఎక్కడైనా అసాధారణ గడ్డలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి బయాప్సీ వంటి పరీక్షలు చేయించుకోవాలి" అని సూచించారు. ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతం చేసిన జనరల్ సర్జన్ డా. ప్రేమ్ కిషోర్, అనస్థీషియా నిపుణులు డా. మహిపాల్, డా. ఇస్రత్, ఓటీ టెక్నీషియన్లు సునీల్, రాజ్‌కుమార్, స్టాఫ్ నర్సులు రాజు, పవని, ఆస్మాను సూపరింటెండెంట్ ప్రత్యేకంగా అభినందించారు. తమకు మెరుగైన వైద్యం అందించిన వైద్య బృందానికి రోగి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.



# ఉపాధి హామీని... నిర్వీర్యం చేస్తున్న కేంద్ర సర్కార్


- **పూజ్య మహాత్మా గాంధీ పేరును తొలగించడం సిగ్గుచేటు**
- **సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఆంక్షా రెడ్డి**

**గజ్వేల్ మార్చి 16 (ప్రజాస్వరం ):-**

గ్రామీణ ప్రాంత కూలీలు, నిరుపేద రైతుల కడుపు నింపుతున్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట అంక్షారెడ్డి విమర్శించారు. వర్గల్, తునికి ఖల్సా, తునికి మక్త, మీనాజీపేట్, శాకారం, అంబర్ పేట గ్రామాల్లో సోమవారం ఉపాధి హామీ కూలీలతో విధానసభలు ఏర్పాటు చేసి ఆమె మాట్లాడారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని పేరు మార్చాలనే దుర్బుద్ధితో... విబిజి రాంజీ పేరుతో కేంద్ర నిధుల్లో కోత విధించి కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర సర్కార్ 40 శాతం నిధులు సమకూర్చాలని పేర్కొంటున్నట్లు ఎద్దేవా చేశారు. వ్యవసాయ కూలీలు, కార్మికుల హక్కులు, వ్యవసాయ అనుబంధ పనులు తొలగించి జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని



కుట్ర చేస్తున్నట్లు ఆరోపించారు. అయితే నిరుపేద రైతులు, వ్యవసా కూలీలు, గిరిజనులు, కార్మికుల ఉపాధి కరువైన సందర్భంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని చేపట్టి కడుపునిండా భోజనం పెట్టినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమాన్ని రద్దు చేయాలనే లక్ష్యంతో ఉన్న కేంద్ర ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ ఉపాధి హామీ కూలీలతో విధాన సభలు, సమావేశాలు నిర్వహించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, మండల కాంగ్రెస్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు వెంకటేష్, సర్పంచులు, ఉప సర్పంచ్లు విజయలక్ష్మి యాదగిరి, కొండగల్ల గణేష్, కుమార్ యాదవ్, కుమార్, గోరెమియా, టేకులపల్లి గోవర్ధన్ రెడ్డి, గంగుమల్ల లక్ష్మి, సహదేవ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, మండల శాఖ అధ్యక్షులు పంజాల సాయి గౌడ్, నేతలు గంగుమల్ల కొండల్ రెడ్డి, నీల శ్రీనివాస్, పాషా భాయ్, యాదగిరి, పొన్నాల నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# కరెంటు కష్టాలు మొదలయ్యాయి.

- రైతులు కోసం ధర్నా చేస్తా
- మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి



**చిన్నశంకరంపేట మార్చి 16 (ప్రజాస్వరం)**

మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ చెప్పిన విధంగానే కరెంటు కష్టాలు మొదలయ్యాయని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలిపారు. సోమవారం ఆమె చిన్న శంకరం పేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి పరిపాలనలో మాటలేమో కోటాలు దాటుతున్నాయి చేతలు గడప దాటడం లేదని, కరెంటు సరిగా రాకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతులు పడిరాని పాట్లు పడుతున్నారని, విద్యుత్ కోసం రైతులు ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. అసెంబ్లీలో తమ పార్టీ ఎమ్మెల్యేలు కరెంట్ విషయంలో ప్రభుత్వాన్ని కరెంట్ విషయంలో ప్రభుత్వాన్ని నిలదీసేందుకు అసెంబ్లీలో మాట్లాడుతారని తెలిపారు. లేనిపక్షంలో తమ పార్టీ రైతులతో పంటలు పరిశీలించి ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పట్లూరి రాజు, మాజీ జెడ్పిటిసి మాధవి, లక్ష్మారెడ్డి, పూలపల్లి యాదగిరి యాదవ్, సూల సావిత్రి పోచయ్య, దయానంద్ యాదవ్, ప్రభాకర్, గొండ స్వామి యాదవ్, ఏమ చంద్రం, మహిపాల్ రెడ్డి, పాండు, తదితరులు పాల్గొన్నారు

## సేవాలాల్ దేవాలయ నిర్మాణానికి భూమి పూజ చేసిన మైనంపల్లి...



**చిన్న శంకరంపేట మార్చి 16 (ప్రజాస్వరం)**

చిన్న శంకరం పేట మండలం కొరివి పల్లి పంచాయతీ పరిధిలోని కొరివి పల్లి తండాలో సేవాలాల్ దేవాలయ నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు భూమి పూజ నిర్వహించారు, ఈ సందర్భంగా గిరిజన మహిళలు వారి సాంప్రదాయ నృత్యం చేస్తూ ఘన స్వాగతం పలికారు, ఆలే కమిటీ సభ్యులు ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ దేవాలయ నిర్మాణానికి మైనంపల్లి హనుమంతరావు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని సేవే పరమపదిగా భావిస్తూ మైనంపల్లి ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, స్థానిక సర్పంచ్ పుల్లారావు, ఉపసర్పంచ్ నర్సింలు, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు మోహన్ నాయక్, మాజీ ఎంపీపీ అరుణ ప్రభాకర్, శ్రీమాన్ రెడ్డి, రాజు రెడ్డి, యాదవరావు, శ్రీనివాస్ రెడ్డి, లింగమూర్తి, ఉదయకుమార్, రమేష్ గౌడ్, చిరంజీవి, శ్రీనివాస్ గౌడ్, ప్రభాకర్, తండా ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## అధిక సాంద్రత పత్తి సాగుపై శిక్షణ కార్యక్రమం

**జగదేవ్‌పూర్ , మార్చి16, (ప్రజాస్వరం )**

ప్రస్తుత వ్యవసాయ పరిస్థితుల్లో పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులను అధిగమించి, రైతులకు మేలైన ఆదాయం కల్పించడమే లక్ష్యంగా మెదక్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జగదేవ్‌పూర్ మండలం బస్వాపూర్ గ్రామంలో ఒక కీలక శిక్షణా కార్యక్రమం నిర్వహించబడింది. అధిక సాంద్రత పత్తి సాగు అనే ఆధునిక పద్ధతి పై రైతులకు శాస్త్రవేత్తలు రవి,నరసింహారావు,మండల అధికారి వసంతరావు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ..రైతులు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందేందుకు ఆధునిక సాగు పద్ధతులు, యంత్రాల వినియోగం మరియు పంట మార్పిడి వంటి ముఖ్యమైన మెలుకువలను వివరించారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది సంతోష్, సుమలత మరియు అనిల్, అఫ్రోజ్, మహేష్, రాశి షిఫ్ట్ ఇంచార్జ్ మనోజ్ కుమార్ మరియు రైతులు పాల్గొన్నారు.



## ఆయిల్ ఫామ్ పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్

**చేగుంట మార్చి 16 (ప్రజా స్వరం )**

జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ. దేవ్ కుమార్ చేగుంట మండలంలోని పెద్దశివునూర్ గ్రామంలో గల ఆయిల్ పామ్ పంటను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక సంఖ్యలో రైతులు ఆయిల్ పామ్ పంట వైపు మొగ్గు చూపాలని తెలిపారు, ఎందుకంటే ఈ పంటను ఒకసారి నాటినట్లయితే నాలుగవ సంవత్సరం నుండి దిగుబడి వరుసగా దాదాపు 25 సంవత్సరాల వరకు వస్తుందని తెలిపారు, ఈ పంట సాగు చేసుకోవడం ద్వారా కోతుల బెడద, అడవి పందుల బెడద, అకాల వర్షాలు, ఎటువంటి వాతావరణ పరిస్థితులైన తట్టుకుందని, ఈ పంట సాగు చేసుకోవడానికి ప్రభుత్వం 90% రాయితీ ఇస్తుందని, మొదటి నాలుగు సంవత్సరాలు 4వేల చొప్పున అంతర పంటలు సాగు చేసుకోవడానికి పెట్టుబడి కూడా ప్రోత్సాహకంగా ఇస్తుందని తెలిపారు, కావున రైతు సోదరులందరూ ఆయిల్ పామ్ పంటను సాగు చేయడానికి ముందుకు రావాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్, పెద్దశివనూర్ గ్రామ సర్పంచ్ ఎర్ర సిద్ధిరాములు, ఉపసర్పంచ్ అన్నం మల్లేష్, వ్యవసాయ విస్తరణ అధికారి భువనేశ్వరి, రైతు సోదరులు తదితరులు పాల్గొన్నారు.



## భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ప్రతిష్ఠ ఉత్సవాలలో పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి...

**చిన్న శంకరంపేట మార్చి 16 (ప్రజాస్వరం)**



చిన్నశంకరంపేట మండలం బాగీర్తి పల్లి గ్రామంలో మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రతిష్ట, కళ్యాణ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు, మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, నియోజకవర్గం ఇంచార్జి కంఠారెడ్డి తిరుపతి రెడ్డి, మాజీ జెడ్పిటిసి మాధవి రాజు లు హాజరయ్యారు గ్రామంలోని యాదవ సంఘం ఆధ్వర్యంలో వచ్చిన అతిథులను భాజా భజంత్రీలతో ఘన స్వాగతం పలికారు, శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం రేణుక మాత దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం వచ్చిన అతిథులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయాల నిర్మాణాలు చేపట్టి ప్రతిష్టత చేపట్టి ఈ ఉత్సవాలు నిర్వహించడం, మల్లికార్జున స్వామి కృపతో గ్రామంలోని ప్రజలు పాడిపంటలతో సుఖసంతోషాలతో ఉండాలని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వారు తెలిపారు, స్వామివారి కృప కటాక్షాలతో ఈ ప్రాంత ప్రజలతోపాటు పరిసర ప్రాంత ప్రజలంతా కూడా సంతోషంగా ఉండాలని గ్రామాలలో దేవాలయాలు నిర్మాణాలు చేపట్టి ఆధ్యాత్మికత నెలకొల్పడం జరుగుతుందని, దేవాలయాల నిర్మాణానికి తమ వంతు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని తెలిపారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ సావిత్రి పోచయ్య యాదవ్, మాజీ సర్పంచ్ సూల్ల దయానంద్ యాదవ్, యాదవ సంఘం గ్రామ అధ్యక్షుడు అయితర బోయిన మహేష్, ఉపాధ్యక్షుడు సంజీవ్ యాదవ్, సూరారం సర్పంచ్ నాగరాజు, మాజీ సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు యాదగిరి యాదవ్, వివిధ గ్రామాల సర్పంచులు ఉపసర్పంచ్లు కార్యకర్తలతో పాటు, నాయకులు లక్ష్మారెడ్డి, ప్రభాకర్, రాజు, మహిపాల్ రెడ్డి, పాండు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.





# మురిసిన లబ్ధిదారులు: కొత్తపేటలో ఇందిరమ్మ ఇంటి పంపిణీ

**జగదేవ్ పూర్,మార్చి 16, (ప్రజాస్వరం)**

జగదేవపూర్ మండలంలోని కొత్తపేట గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మఇంటి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ క్రమంలో, సోమవారం లబ్ధిదారులు మొగిలి నర్సమ్మ-సత్యనారాయణ దంపతుల నూతన గృహాన్ని మండల అభివృద్ధి అధికారి వేణుగోపాల్ రెడ్డి, స్థానిక సర్పంచ్ జ్యోతి మహేష్ కలిసి రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. గ్రామాల్లో ఇంకా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు, అధికారులు సమన్వయంతో త్వరగా పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ కాజా మొయినుద్దీన్, హౌసింగ్ ఏఈ విశాఖ, ఉపసర్పంచ్ కస్తూరి అమరేందర్ రెడ్డి, వార్డు సభ్యులు మరియు ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# వైద్య ఖర్చులు నేనే భరిస్తా మైనంపల్లి భరోసా...

**చిన్న శంకరంపేట మార్చి 16 (ప్రజాస్వరం )**

చిన్న శంకరంపేట మండలం కొరివిపల్లి గ్రామానికి చెందిన బంటు నర్సింలు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నేడు ఇంటికి చేరుకున్న ఆయనను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పరామర్శించారు, వైద్య ఖర్చుల నిమిత్తం 25 వేల రూపాయలు అందిస్తున్నట్లు తెలిపారు, కొరివిపల్లి గ్రామానికి ఒక వాహనాన్ని ఏర్పాటు చేసుకోవాలని వాహన ఖర్చులు భరిస్తానని ఎవరికి ఎలాంటి అనారోగ్య సమస్య వచ్చిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించాలని ఆయన గ్రామస్తులకు సూచించారు, ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయో ముందుగానే సమాచారం అందిస్తే నేమ్స్ ఆసుపత్రియా లేదా ఇతర ఆస్పత్రికి తరలించాలని ఆలోచన చేసి వైద్యులతో మాట్లాడి వైద్యులను అందుబాటులో ఉంచడం జరుగుతుందని, ఆసుపత్రి ఖర్చులు కూడా తానే భరిస్తానని ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులకు తెలిపారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, సర్పంచ్ పుల్లారావు ఉపసర్పంచ్ నరసింహులు, మాజీ జెడ్పిటిసి కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు పోతరాజు రమణ, శ్రీమాన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అరుణ ప్రభాకర్, మాజీ సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, రాజు రెడ్డి, సురేందర్ నాయక్, యాదవరావు, లింగమూర్తి, చిరంజీవి, రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం. పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్....



**మెదక్ మార్చ్ 16 (ప్రజా స్వరం)**

మెదక్ జిల్లా శంకరంపేట ఆర్ మండలం భగీరథపల్లి గ్రామంలో సోమవారం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో సోమవారం మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం.పద్మదేవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సూళ్ల సావిత్రి పోచయ్య, మాజీ సర్పంచ్ దయాకర్ యాదవ్, మాజీ మండల రైతు సమన్వయ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సర్పంచ్ లు చిలుక నాగరాజు, ఇమ్మడి నరేష్, నాయకులు మహిపాల్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యేక వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ సుజాత మల్లేశం గౌడ్..

- **ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్..**

**నార్సింగి, మార్చ్ 16 (ప్రజా స్వరం )**







రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 99 రోజుల "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి మండల వైద్యారోగ్య అధికారి డా.రవి కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని నార్సింగి సర్పంచ్ ఆకుల సుజాత మల్లేశ్ గౌడ్ ప్రారంభించారు. మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రత్యేక వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యారోగ్య అధికారి డా. శ్రీరామ్ సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అధికారి వైద్య బృందానికి పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం డా. శ్రీరామ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వచ్చే నెలలో కూడా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తారని తెలిపారు. వైద్య శిబిరంలో స్త్రీ వ్యాధి, చిన్న పిల్లల, పంటి, కంటి, జనరల్ వైద్యం విభాగాలకు చెందిన నిపులతో వైద్యం అందివ్వడం జరుగుతుందని వివరించారు. జిల్లాలో దాదాపు 90 వేల మంది బీపీ కోసం, 54 వేల మంది షుగర్ వ్యాధి, 574 క్యాన్సర్ బాధితులు ఉన్నారని అన్నారు. జిల్లాలో ఉన్న స్వయం సహాయక సంఘాలలో ఉన్న దాదాపు 1.45 లక్షల మహిళలతో పాటు, 40 సం లు ఆపై బడిన వయసు మహిళలకు ప్రణాళికా బద్ధంగా శిబిరంలో ప్రత్యేకంగా గర్భ కోశ సమస్యలు ఉంటే వారి ఆధార్, ఫోన్ నెంబర్ వంటి తదుపరి చికిత్స కోసం అవసరమున్న వివరాలు సేకరించి క్యాన్సర్ పరీక్ష కోసం వారి నుంచి "పాప్ స్మియర్" నమూనాలు తీసుకుని టీ హబ్ లో పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. పరీక్షలలో క్యాన్సర్ సమస్య ఉన్నట్లు నిర్ధారణ అయిన వారికి తదుపరి చికిత్స అందిస్తామని అన్నారు. క్యాన్సర్ తో పాటు అన్ని రకాల సమస్యలకు ప్రాధమిక పరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి చికిత్స అందిస్తామని అన్నారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాల పై ఆశాలు, ఏ.ఎన్.ఎం లు ప్రజలలో అవగాహన కల్పించడం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రజలు అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొవాలని జిల్లా వైద్యాధికారి డా. శ్రీరామ్ కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆకుల మల్లేశ్ గౌడ్, హెచ్.ఈ.ఓ శ్రీనివాస్, ఎం.పీ.హెచ్.ఏ సూపర్వైజర్ ఉమా రాణి, కృష్ణా, స్టాఫ్ నర్స్ లక్ష్మీ బాయి, పల్లె దవాఖానా వైద్యులు, నర్సింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు .

# మల్లికార్జున స్వామి కళ్యాణం ఉత్సవానికి హాజరైన సికింద్రాబాద్ మాజీ ఎంపీ మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి....





**చిన్న శంకరంపేట మార్చి 16 (ప్రజాస్వరం)**

చిన్న శంకరంపేట మండలం భాగిర్తిపల్లి గ్రామంలో శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామీ దేవాలయ ప్రతిష్ట కల్యాణోత్సవానికి మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సికింద్రాబాద్ మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ హాజరయ్యారు, ఉత్సవాలకు హాజరైన వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భాజ భజంత్రీలతో ఘన స్వాగతం పలికారు అనంతరం దేవాలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో దేవాలయాలు నిర్మించి భక్తి కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందని ప్రతి ఒక్కరిలో భక్తి భావన పెంచుకొని ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని వారు సూచించారు, స్వామివారి కృపా కటాక్షాలతో ఈ ప్రాంత ప్రజలతోపాటు రాష్ట్ర ప్రజలంతా కూడా సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని పాడి పంటలు సమృద్ధిగా పండాలని రైతులంతా కూడా సంతోషంగా ఉండాలని వారు స్వామి వారిని కోరుకున్నట్టు తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ సావిత్రి పోచయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు మోహన్ నాయక్, మాజీ జెడ్పిటిసి పోతరాజు రమణ, మాజీ సర్పంచ్ దయానంద యాదవ్, శ్రీమాన్ రెడ్డి, రాజు రెడ్డి, రాజ్ కుమార్ గౌడ్, పవన్ గౌడ్, ఇంత గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అధిక సాంద్రత పద్దతిలో ప్రత్తి సాగు పై అవగాహన కార్యక్రమం

**జగదేవ్ ర్ పూర్ ,మార్చి 16, (ప్రజాస్వరం )**

జగదేవ్‌పూర్ మండలం బస్వాపూర్ గ్రామం లో నిర్వహించిన అధిక సాంద్రత ప్రత్తి సాగు పై అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు కీటక శాస్త్ర నిపుణులు అయిన డా. రవి మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో చీడ పీడల యాజమాన్యం గురించి చేపట్ట వలసిన సస్యరక్షణ చర్యల గురించి రైతులకు తెలిపారు. అదేవిధంగా సీనియర్ శాస్త్రవేత్త అయిన డా . దత్తాత్రేయ నల్కార్ ఎరువుల యాజమాన్యం మరియు మొక్క ఎదుగుదల నియంత్రకాలైన మెపిక్వాటుక్లోరైడ్(చమత్కార్) దాని యొక్క ఉపయోగాలు మరియు రైతుల సందేహాలకు సలహాలు సూచనలు చేశారు. మరియు మండల వ్యవసాయ అధికారి వసంతరావు మాట్లాడుతూ అధిక సాంద్రత పద్దతిలో ప్రత్తి సాగు మరియు యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ విస్తరణ అధికారి కిరణ్ కుమార్ ,KVK యంగ్ ప్రొఫెషినల్స్, సంతోష్ ,సుమలత,అనిల్,అఫ్రోజ్,మహేష్ రైతులు పాల్గొన్నారు.



# రోడ్డు కు అడ్డంగా విరిగి పడిన భారీ వృక్షం

**తూప్రాన్ మార్చ్ 16 (ప్రజా స్వరం )**

తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామ శివారులో భారీ వృక్షం నేలకూలడంతో పెను ప్రమాదం తప్పింది. గుండ్రెడ్డిపల్లి నుంచి మల్కాపూర్ వెళ్లే రహదారిపై గాలి దుమారంతో కూడిన వర్షం కారణంగా చెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరు రాకపోకలు సాగించకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ గ్రామస్తులతో కలిసి ట్రాక్టర్ సహాయంతో చెట్టును రోడ్డు పై నుండి తొలగించారు. తక్షణమే స్పందించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించిన సర్పంచ్ పై పలువురు ప్రశంసలు కురిపించారు.



# చలో అసంబ్లీ కి వెళ్లే అంగన్వాడీ టీచర్ల ను ముందస్తు అరెస్ట్....

**తూప్రాన్ మార్చ్ 16( ప్రజా స్వరం )**

తూప్రాన్ మండలంలోని అంగన్వాడీ టీచర్ల ను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అంగన్వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాల ని సోమవారం అంగన్వాడీల అసోసియేషన్ చలో అసెంబ్లీకి పిలుపునిచ్చింది. చలో అసెంబ్లీ పిలుపు నేపథ్యంలో తూప్రాన్ మండలంలోని అంగన్వాడీ టీచర్లు ఇందిరా . మనిలా. ఆధ్వ ర్యంలో అసంబ్లీ కి సోమవారం ఉదయం వెళ్లే టీచర్లను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.




# దేవస్థాన నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

**మేడ్చల్ (ప్రజాస్వరం) :**

ఈరోజు మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్ల పోచంపల్లి లక్ష్మీనారాయణ స్వామి దేవస్థా నానికి నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్ గారు, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవస్థానం నూతన చైర్మన్‌గా కృష్ణ రెడ్డి గారు, డైరెక్టర్లుగా కుంద స్వప్న, దానమ్మ గారి సురేందర్ రెడ్డి, బండారి అనిల్ ముదిరాజ్, మండల ఉదయ్ గౌడ్, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం అతిథులు నూతన కమిటీ సభ్యులను అభినందిస్తూ, దేవాలయ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు రవి ముదిరాజ్,గుండ్లపో



చంపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయి పేట శ్రీనివాస్, మేడ్చల్ మండల్ మాజీ అధ్యక్షులు రమణ రెడ్డి,మాజీ సర్పంచ్ నరేందర్,మాజీ సర్పంచ్, బైరేశ్వర్,సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్,మేడ్చల్ సర్కిల్ కి చెందిన ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, దేవస్థాన కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దశ దిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు....

**మెదక్ మార్చ్ 16 (ప్రజా స్వరం)**

ప్రముఖ చలనచిత్ర (డీజే టిల్లు , బలగం, మ్యాడ్) సినిమాల నటుడు రామాయంపేట వాస్తవ్యుడు ఐరేని మురళీధర్ గౌడ్ సతీమణి, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఐరేని పృథ్వీ రాజ్ (బాలు) తల్లి ఐరేని శశికళ కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మరణించడం విషయం తెలిసిందే... ఈ సందర్భంగా సోమవారం రామాయంపేట పట్టణంలోని వినాయక ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన దశ దిన కర్మ కార్యక్రమ నికి మెదక్ జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రామయంపేట మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉమా మహేశ్వర్, హైమద్, దోమకొండ శ్రీనివాస్ సాగర్, శ్రీకాంత్, సాగర్, హస్నుద్దీన్, పోల్కం నాగార్జున్, రొయ్యల నవీన్, రొయ్యల మధుకర్, మర్కు రాజు సాగర్, సరఫ్ నిఖిల్, మధునాల శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# హామీలకే పరిమితమైన కాంగ్రెస్ పార్టీ...

- **ఎమ్మార్వో రఘువీరారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు**

**గజ్వేల్ మార్చి 16 (ప్రజాస్వరం ):-**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులవుతున్నా, పెన్షన్లు, ఫీజు రీయింబర్స్మెంట్, రుణమాఫీ, రైతు భరోసా వంటి హామీలను గాలికొదిలేసి ప్రజలను దారుణంగా మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర జిల్లా శాఖ పిలుపు మేరకు మెదక్ ఎంపీ వర్యులు రఘునందన్ రావు సూచన మేరకు బీజేపీ వర్గల్ మండల అధ్యక్షులు బొల్లిపల్లి తిరుపతి రెడ్డీ ఆధ్వర్యంలో వర్గల్ మండల ఎమ్మార్వో రఘువీరారెడ్డికి వినతిపత్రం అందజేశారు. రైతులు,విద్యార్థులు, మహిళల ఆక్రోశానికి అద్దం పడుతూ.. ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై బిజెపి సమరశంఖం పూరించిందన్నారు .ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు రామాంజనేయులు చిరంజివి వెంకటేష్ బూత్ అధ్యక్షులు బద్రీనాథ్ సీనియర్ నాయకులు సుధాకర్ రెడ్డి నాగరాజు



గౌడ్ మఠంమహిపాల్ బబ్బూరి రవీందర్ శంకర్ గౌడ్ బర్కంనాగరాజు నరేందర్ రెడ్డి బన్నీ రెడ్డి పారశురాం గౌడ్ మహేందర్ గౌడ్ కాశీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం 6 గ్యారంటీలు అమలు చేయాలి కాప్రా ఎమ్మార్వో కు బిజెపి నాయకుల వినతి

**జవహర్ నగర్, మార్చ్ 16, (ప్రజాస్వరం):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరు గ్యారెంటీ ల పేరుతో ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి గ్యారంటీల అమలులో వైఫల్యం చెందాడని బిజెపి నాయకులు ఆరోపించారు. సోమవారం రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు జవహర్ నగర్ బిజెపి అధ్యక్షుడు కలికోట కమలాకర్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు ఆరు గ్యారంటీల అమలు వైఫల్యాన్ని నిరసిస్తూ కాప్రా ఎమ్మార్వో బైరెడ్డి రాజేష్ కు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల ముందు అమలు కానీ హామీలు ఇచ్చి ఆరు గ్యారెంటీ ల పేరుతో ప్రజలను మోసం చేసే అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి 100 రోజుల్లో పథకాలను అమలు చేస్తానని దేవుళ్లపై ఒట్టు వేశారన్నారు. రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు 6 గ్యారంటీలు అమలుకు నోచుకోలేదు అన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు మహేందర్ యాదవ్, సంతోష్ గుప్తా,మరాఠీ బాబు, లిఖిత యాదవ్,మాజీ కార్పొరేటర్ బాబు, జోగారావు, రాము నాయక్, వేపుల సన్నీ, రాజేశ్వరి, ముచ్చర్ల యాదగిరి, సందీప్ ముదిరాజ్, కొంపల్లి చంద్రశేఖర్, చింతం రెడ్డి లక్ష్మీదేవి, పానుగంటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# ఇరాన్ పై ఇజ్రాయిల్,అమెరికా దాడులు ఆపాలి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్

**జవహర్ నగర్,మార్చి 16, (ప్రజాస్వరం):**


ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ చేస్తున్నావ్ యుద్ధకాండ వెంటనే ఆపాలని మేడ్చల్ జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ అన్నారు. సోమవారం జవహర్ నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కాప్రా మండల సిపిఐ కార్యదర్శి దర్శనం యాదగిరి అధ్యక్షత సిపిఐ నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నిరసనలో పాల్గొన్న తోటపల్లి శంకర్ మాట్లాడుతూ... యుద్ధము వలన గ్యాస్ సిలిండర్,నిత్యవసర వస్తువులు విపరీతంగా ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే గ్యాస్ ధర పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు గ్యాస్ సిలిండర్ దొరకక ప్రజలు అనేక అవస్థలు పడు తున్నారు ప్రజల అవసరాలు దృష్టిలో పెట్టుకొని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పెరిగే ధరలను అదుపు అదుపు చేయాలన్నారు. యుద్ధం ఆపే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహులు,సిపిఐ సీనియర్ నాయకులు సిహెచ్ దశరథ్, సిపిఐ అల్వాల్ మండల కార్యదర్శి అమరావతి బాబు, రైతు సంగం జిల్లా అధ్యక్షులు డి జంగయ్య ,గిరిజన సమైక్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యామలలత ,వి స్వరూప నాయక్, ప్రజా కళాకారుడు వి.వెంకటచారి,సిపిఐ నాయకులు పి నరసింహ, చిరంజీవి,ఎన్ పద్మ, ఎన్ సంతోష,డి మల్లిక,కోమల గణేష్ ,తదితరులు పాల్గొన్నారు.




# తూప్రాన్ లో మల్లికార్జున స్వామి కళ్యాణం...

**తూప్రాన్ మార్చ్ 16 (ప్రజాస్వరం )**

మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో స్వయంభుగా వెలసిన మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం తుమ్మెట శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా కల్యాణోత్సవం నిర్వహించారు జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు మల్లికార్జున స్వామి కళ్యాణం మంగళవారం రోజు రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు కల్యాణ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు చివరి రోజు ఒగ్గు పూజారిలచే ఒగ్గు కథ ఉంటుందని తుమ్మట శ్రీనివాస్ యాదవ్ తెలిపారు ఈ కార్యక్రమంలో నాచారం ఆలయ చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్తా కాంగ్రెస్ పార్టీ మండల ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు మామిళ్ళ కృష్ణ ప్రింటర్ శ్రీనివాస్ విశ్వరాజ్ కృష్ణ చంద్రకాంత్ గుప్తా తదితరులు పాల్గొన్నారు



# తమ్ముని మృతికి కారణమైన అన్న అరెస్టు : సిద్దిపేట టూ టౌన్ పోలీస్

ప్రజాస్వరం :

బోయగల్లి సిద్దిపేటలోని వంగలి రాములు, వంగలి ప్రభు, వంగలి కొండలు అని వారికి సంబంధించిన పాత ఇల్లు దరచేసుకోగా , వంగలి కొండలు పట్టుకొని మిగతా ఇద్దరికీ డబ్బులు చెల్లించినాడు కానీ అట్టి ఇంటిని కొండాల పేరు మీద మార్చుటకు డబ్బులు తీసుకొని కూడా రాములు సంతకం చేయకుండా వేధింపులు చేయుచు మరియు వారి అమ్మమ్మకు చెందిన 60 గజాల భూమిని ఎవరికి తెలవకుండా వంగలి రాములు తన భార్య చంద్రకళ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకుని అడిగినందుకు కొండాలును రాములు మరియు అతని భార్య చంద్రకళ తిట్టి అవమానించినందున అట్టి అవమానం భరించలేక తేదీ 15 /06/ 2026 రోజున వంగలి కొండలు పురుగుల మందు తాగుట వల్ల అది విషమించి తేదీ 22/0 6/2026 రోజున అస్వస్థకు గురికాగా తన కుటుంబ సభ్యులు సిద్దిపేట లోని ప్రభుత్వాసుపత్రి తరలించి మెరుగైన చికిత్స గురించి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించుండగా తేదీ 26/02/26 రోజున మరణించినాడని మృతుని యొక్క రెండవ అన్నయ్య వంగలి ప్రభు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉపేందర్ ఇన్స్పెకర్ అఫ్ పోలీస్ గారు టూ టౌన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి, ఈరోజు నిందితులు అయిన వంగలి రాములు అతని భార్య చంద్రకళను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగినదని టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ తెలిపారు.




# ఉద్యమకారిణి సిద్దిపేట మహిళా అధ్యక్షురాలు టైగర్ నర్సమ్మ మృతి...

- **మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు.**

ప్రజాస్వరం:



సిద్దిపేట పట్టణానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు ఉద్యమకారిణి టైగర్ నర్సమ్మ అనారోగ్యం తో మృతి చెందింది.. ఆమె మృతి పట్ల మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు సంతాపం వ్యక్తం చేశారు.. మొదటి నుండి కెసిఆర్ వెన్నంటే ఉన్న ఉద్యమకారిణి అని, కెసిఆర్ గారికి నాకు ఎంతో ఆత్మీయురాలు అని ఆమె మృతి బాధాకరమన్నారు.. పార్టీ ఆవిర్భావం నుండి నెటి వరకు పార్టీ లో ఎంతో క్రియాశిలకంగా పని చేసిందని ఉద్యమ సమయం లో మహిళా లోకాన్ని ఒక్క తాటి పైకి తెచ్చిందని, ఆమె పటిమ ను గుర్తించి స్వయంగా కెసిఆర్ గారే టైగర్ నర్సమ్మ గా పేరు ఇచ్చారని .. అలాంటి గొప్ప ఉద్యమకారిణి, ఒక నిబద్దత గల నాయకురాలు గా 25ఏళ్లు పార్టీ కి అందించిన సేవలను కొనియాడారు.. ఆమె మృతి పార్టీ కి తీరని లోటని ఆమె కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని, ప్రగాఢ సానుభూతి ని తెలియజేసారు...

# దివ్యాంగులను మరచిన కాంగ్రెస్ ప్రభుత్వం!!

- **దివ్యాంగులకు 6000 పెన్షన్ ఏమైంది సార్.**
- **దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కెమ్మసారం అశోక్**

ప్రజాస్వరం :



దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం తరుపున కాంగ్రెస్ ప్రభుత్వాని సూటిగా హెచ్చరిస్తూ తెలంగాణ రాష్ట్రంలో దివ్యాంగులు పడుతున్న కష్టాలు ఏమాత్రం పట్టించుకోకుండా ఈరోజు బడ్జెట్ సమావేశంలో దివ్యాంగుల గురించి ఏ ఊసు కూడా ఎత్తకుండా మహిళలకు మహిళ గ్రూపులకు మేము ఇది చేసాం అది చేస్తామని డబ్బాలు కొట్టుకుంటూ చెప్పిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఏం చేసిందో అసెంబ్లీలో తెలియపరచాలని తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి గత మూడు సంవత్సరాలు గడుస్తున్నా కానీ దివ్యాంగులకు ఏ ఒక్క సంక్షేమ పథకం అందని పరిస్థితిలో దివ్యాంగులు ఉన్నారని సీఎం రేవంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నిస్తూ జరగబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో దివ్యాంగుల గురించి అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడకపోతే ప్రతిపక్షాలు ఏం చేస్తున్నాయి సీఎం రేవంత్ రెడ్డి గారికి దివ్యాంగులు గుర్తుకు వస్తలేరేమో కానీ ప్రతిపక్ష బిఆర్ఎస్ బిజెపి పార్టీలకు కూడా దివ్యాంగులు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న విషయం తెలియదా దివ్యాంగుల ఓట్లు వినియోగించుకోవట్లేదా అని దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షునిగా కెమ్మసారం అశోక్ అనే నేను తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని పార్టీలను కూడా సూటిగా ప్రశ్నిస్తున్నాను దివ్యాంగుల గురించి దివ్యాంగులకు ఇచ్చిన హామీల గురించి ప్రతిపక్షాలు ఎందుకు అసెంబ్లీలో మాట్లాడలేకపోతున్నారని ప్రతిపక్షాలన్నీ ప్రశ్నిస్తున్నాను దయచేసి మా దివ్యంగుల బాధలు అసెంబ్లీలో తెలియపరచగలరని ప్రతిపక్షాలని విజ్ఞప్తి చేస్తున్నాను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు సీఎం రేవంత్ రెడ్డి గారు మీరు మా దివ్యాంగులకు ఇచ్చిన హామీలు అన్నీ కూడా ఈ బడ్జెట్ సమావేశాల్లో మీరు నెరవేర్చలేక పోతే తెలంగాణ రాష్ట్రంలో ఉన్న దివ్యాంగుల అన్ని సంఘాలు కూడా అసెంబ్లీ ముట్టడిస్తాయని సుడిగా హెచ్చరిస్తూ వెంటనే బడ్జెట్ సమావేశాల్లో మీరు ఇచ్చిన హామీ ప్రకారం దివ్యాంగులకు 6000 పెన్షన్ తో సహా ఫ్రీ బస్ మరియు దివ్యాంగులకు ఆదవలసిన వివిధ సంక్షేమ పథకాలు అన్నీ కూడా అందేలా జరగబోయే బడ్జెట్ సమావేశాల్లో మీరు మా దివ్యంగుల ను ఉద్దేశించి మాట్లాడగలరని కోరుతున్నాను.

# పశ్చిమాసియా ఉద్రిక్తతలు.. కేంద్రంపై కాంగ్రెస్ విమర్శలు

- **బ్రిక్స్ వేదికగా భారత్ స్పందనపై రాజకీయ దుమారం**
- **బ్రిక్స్ అధ్యక్ష దేశంగా సమష్టి ప్రకటన చేయలేదన్న కాంగ్రెస్**
- **అమెరికా, ఇజ్రాయెల్‌తో సంబంధాల కోసమేమౌనమని ఆరోపణ**
- **పశ్చిమాసియా ఉద్రిక్తతలపై దౌత్య మార్గాలే పరిష్కారమని వెల్లడి**
- **ఇరాన్‌పై దాడుల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలు**
- **పార్లమెంట్‌లో పూర్తి స్థాయి చర్చ జరపాలని కాంగ్రెస్ డిమాండ్**
- **విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రకటనపై ప్రతిపక్ష అసంతృప్తి**

నేషనల్‌బ్యూరో, (ప్రజాస్వరం):



పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిపై దేశీయ రాజకీయాల్లో చర్చలు ముదురుతున్నాయి. ముఖ్యంగా బ్రిక్స్ కూటమికి భారత్ అధ్యక్ష దేశంగా వ్యవహరిస్తున్న సమయంలో ఆ వేదిక నుంచి సమష్టి ప్రకటన విడుదల చేయకపోవడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు గుప్పించింది. పశ్చిమాసియా పరిస్థితులపై భారత ప్రభుత్వం స్పష్టమైన వైఖరి తీసుకోలేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరాం రమేశ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.
జైరాం రమేశ్ చేసిన వ్యాఖ్యల ప్రకారం బ్రిక్స్ కూటమికి అధ్యక్షత వహిస్తున్న దేశంగా భారత్ అంతర్జాతీయ స్థాయిలో స్పష్టమైన స్పందన ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ఇప్పటివరకు పశ్చిమాసియా ప్రాంతంలో జరుగుతున్న సంఘటనలపై బ్రిక్స్ తరఫున సమిష్టి ప్రకటన చేయడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు రాలేదని ఆయన విమర్శించారు. ముఖ్యంగా ఇరాన్‌పై అమెరికా మరియు ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన వైమానిక దాడులపై భారత ప్రభుత్వం నేరుగా స్పందించలేదని అన్నారు. ఇదే సమయంలో గల్ఫ్ ప్రాంతంలోని సైనికేతర లక్ష్యాలపై ఇరాన్ చేపడుతున్న దాడులు, హిందూ మహాసముద్రంలో జరిగిన నౌకాదళ ఘటనలపై కూడా స్పష్టమైన సమిష్టి ప్రకటన చేయడానికి కేంద్రం ముందుకు రాలేదని పేర్కొన్నారు.
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సంతృప్తిపర్చాలనే ప్రయత్నం కారణంగా కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ అంశాల్లో జాగ్రత్తగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. అలాగే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాలను దృష్టిలో పెట్టుకుని కూడా భారత్ స్పష్టమైన ప్రకటన చేయడం లేదని జైరాం రమేశ్ అభిప్రాయపడ్డారు. ఈ విధంగా వ్యవహరించడం వల్ల బ్రిక్స్ కూటమి అధ్యక్ష దేశంగా భారత్‌కు ఉన్న ప్రాధాన్యత తగ్గిపోతుందని ఆయన అన్నారు.
పశ్చిమాసియాలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై కాంగ్రెస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. 2025 జూన్ 13 నుంచి ఇరాన్‌పై జరుగుతున్న సైనిక దాడులు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తున్నాయని పార్టీ పేర్కొంది. ఐక్యరాజ్యసమితి చార్టర్‌కు వ్యతిరేకంగా జరిగే చర్యలు ప్రాంతీయ స్థిరత్వానికి ప్రమాదకరమని కాంగ్రెస్ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో యుద్ధ చర్యలను వెంటనే ఆపి శాంతి పునరుద్ధరణకు ప్రయత్నాలు చేయాలని సూచించింది. సమస్యలను హింసాత్మక మార్గాల్లో కాకుండా దౌత్యపరమైన చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.
ఇదిలా ఉండగా ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ హత్య ఘటనపై కూడా కేంద్ర ప్రభుత్వం మౌనం వహిస్తోందని కాంగ్రెస్ విమర్శించింది. ఈ విషయంపై గత వారం కూడా కాంగ్రెస్ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశారు. అమెరికా మరియు ఇజ్రాయెల్‌తో ఉన్న సంబంధాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం నేరుగా స్పందించడం లేదని ఆరోపించారు. గల్ఫ్ ప్రాంతాలపై ఇరాన్ దాడులను భారత్ ఖండించినప్పటికీ, ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ దాడుల విషయంలో మాత్రం మౌనం పాటించిందని కాంగ్రెస్ అభిప్రాయపడింది.
పశ్చిమాసియా పరిస్థితుల ప్రభావం భారతదేశంపై కూడా పడే అవకాశం ఉన్నందున ఈ అంశంపై పార్లమెంట్‌లో పూర్తి స్థాయి చర్చ జరగాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. లోక్‌సభ మరియు రాజ్యసభలో ఈ విషయాన్ని చర్చకు తీసుకురావాలని ప్రతిపక్షం కోరింది. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై చర్చకు అనుమతించడంలో ఆసక్తి చూపడం లేదని కాంగ్రెస్ ఆరోపించింది. పార్లమెంట్‌లో చర్చ జరిగితే విదేశాంగ విధానంపై ఉన్న లోపాలు బయట పడతాయని ప్రభుత్వం భావిస్తున్నదని కాంగ్రెస్ నాయకులు అన్నారు.
ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం తరఫున విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇటీవల పార్లమెంట్‌లో పశ్చిమాసియా పరిస్థితులపై ప్రకటన చేశారు. పశ్చిమాసియాలో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అక్కడి పరిణామాలను భారత్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నదని తెలిపారు. పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారకుండా ఉండేందుకు దౌత్యపరమైన ప్రయత్నాలు అవసరమని చెప్పారు. సమస్యలకు శాంతియుత పరిష్కారం కనుగొనాలని భారత్ నమ్ముతుందని ఆయన స్పష్టం చేశారు.
పశ్చిమాసియాలో నివసిస్తున్న భారతీయుల భద్రత మరియు సంక్షేమం కేంద్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని జైశంకర్ పేర్కొన్నారు. అక్కడి పరిస్థితులపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా పరిస్థితులను దగ్గరగా గమనిస్తున్నారని చెప్పారు. పశ్చిమాసియాలో శాంతి భంగం కలిగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. అయితే విదేశాంగ మంత్రి చేసిన ఈ ప్రకటనతో కాంగ్రెస్ నేతలు సంతృప్తి వ్యక్తం చేయలేదు. పార్లమెంట్‌లో పూర్తి స్థాయి చర్చ అవసరమని మళ్లీ డిమాండ్ చేశారు. జైశంకర్ చేసిన ప్రకటన సరిపోదని కాంగ్రెస్ అభిప్రాయపడింది. పశ్చిమాసియా పరిస్థితులపై స్పష్టమైన విధానం వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ అంశంపై పార్లమెంట్‌లో కూడా ఉద్రిక్త పరిస్థితులు కనిపించాయి. రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తూ వాకౌట్ చేశారు. లోక్‌సభలో కూడా కాంగ్రెస్ సభ్యులు నిరసనలు చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించారు. పశ్చిమాసియా సంక్షోభం వంటి ముఖ్యమైన అంతర్జాతీయ అంశంపై ప్రభుత్వం పార్లమెంట్‌ను నమ్మకంగా తీసుకోవాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది.
మొత్తంగా చూస్తే పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు భారతదేశ రాజకీయాల్లో కూడా చర్చకు దారి తీస్తున్నాయి. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం పరిస్థితులను సమీక్షిస్తూ దౌత్యపరమైన పరిష్కారాన్ని కోరుతుండగా, మరోవైపు ప్రతిపక్షం ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈ అంశంపై పార్లమెంట్‌లో మరింత చర్చ జరిగే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

- **2025వ సంవత్సరానికి పురస్కారాలు ప్రకటించిన కేంద్రం**
- **దేశంలోని 24 భాషల్లో ఉత్తమ రచనలకు సాహిత్య అవార్డులు**
- **కరోనా కాలపు సామాజిక పరిస్థితులను ప్రతిబింబించిన 'అనిమేష'కు గుర్తింపు**
- **మార్చి 31న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డుల ప్రదానం**
- **విజేతలకు తామ్రపత్రం, శాలువా, లక్ష రూపాయల నగదు బహుమతి**
- **కవిత్వం, నవలలు, కథలు, వ్యాసాలు సహా పలు ప్రక్రియలకు అవార్డులు**
- **తెలుగు సాహిత్యంలో ప్రత్యేక ముద్ర వేసిన రచయితకు మరో ఘనత**

హైదరాబాద్, (ప్రజాస్వరం):



దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు-2025ను సోమవారం అధికారికంగా ప్రకటించారు. దేశంలోని వివిధ భారతీయ భాషలలో వెలువడిన ఉత్తమ రచనలను ఎంపిక చేసి ఈ పురస్కారాలను ఖరారు చేసినట్లు కేంద్ర సాహిత్య అకాడమీ వెల్లడించింది. మొత్తం 24 భారతీయ భాషలలోని రచయితలకు ఈ ఏడాది అవార్డులు ప్రకటించబడినట్లు అకాడమీ అధికారులు తెలిపారు. సాధారణంగా ప్రతి ఏడాది డిసెంబర్ నెలలో ఈ అవార్డులను ప్రకటించే సంప్రదాయం ఉన్నప్పటికీ, ఈసారి కొన్ని అనివార్య కారణాల వల్ల ప్రకటన ఆలస్యమైంది. దీంతో 2025 సంవత్సరానికి సంబంధించిన అవార్డులను ఇప్పుడు అధికారికంగా వెల్లడించారు.
కేంద్ర సాహిత్య అకాడమీ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ ఏడాది ఎంపికైన రచనల్లో విభిన్న సాహిత్య ప్రక్రియలకు చెందిన పుస్తకాలు ఉన్నాయి. మొత్తం అవార్డులలో 8 కవితా సంకలనాలు, 4 నవలలు, 6 కథా సంకలనాలు, 2 వ్యాస సంపుటాలు, ఒక సాహిత్య విమర్శ గ్రంథం, ఒక ఆత్మకథ, రెండు జ్ఞాపకాల పుస్తకాలు (మెమొయిర్స్) చోటు దక్కించుకున్నాయి. దేశంలోని వివిధ భాషల్లో సాహిత్య సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహించడమే ఈ అవార్డుల ప్రధాన ఉద్దేశమని అకాడమీ పేర్కొంది.
ఈ అవార్డులను అందుకున్న రచయితలకు వచ్చే మార్చి 31న న్యూఢిల్లీ నగరంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో సన్మానం చేయనున్నారు. ఆ కార్యక్రమంలో ప్రతి విజేతకు శాలువా కప్పి సాహిత్య అకాడమీ ప్రతిష్ఠాత్మక పురస్కారం అయిన తామ్రపత్రాన్ని అందజేస్తారు. అదనంగా ఒక లక్ష రూపాయల నగదు బహుమతిని కూడా అందిస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ సాహిత్యవేత్తలు, రచయితలు, సాంస్కృతిక రంగానికి చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు అకాడమీ తెలిపింది.
ఈ ఏడాది తెలుగు భాషకు సంబంధించిన సాహిత్య అకాడమీ అవార్డు ప్రముఖ కవి నందిని సిధారెడ్డికి దక్కింది. ఆయన రచించిన 'అనిమేష' అనే కవితా సంపుటికి ఈ ప్రతిష్ఠాత్మక గౌరవం లభించింది. కరోనా మహమ్మారి సమయంలో సమాజంలో ఏర్పడిన పరిస్థితులు, ప్రజల జీవన విధానంలో వచ్చిన మార్పులు, మానవ సంబంధాలపై పడిన ప్రభావం వంటి అంశాలను కవిత్వ రూపంలో ప్రతిబింబించినందుకు ఈ కవితా సంపుటి ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ రచనలో సమకాలీన సమాజం ఎదుర్కొన్న భావోద్వేగాలు, ఆందోళనలు, ఆశలు, నిరాశలను కవి సున్నితంగా చిత్రీకరించినట్లు సాహిత్య విమర్శకులు అభిప్రాయపడుతున్నారు.
నందిని సిధారెడ్డి తెలుగు సాహిత్యంలో ప్రత్యేక గుర్తింపు పొందిన కవి. ఆయన రచనలు తెలంగాణ సంస్కృతి, సమాజ జీవితం, గ్రామీణ వాస్తవాలను ప్రతిబింబించేలా ఉంటాయని సాహిత్య వర్గాలు పేర్కొంటాయి. ఈ అవార్డు ద్వారా ఆయన సాహిత్య ప్రయాణానికి మరో గొప్ప గుర్తింపు లభించినట్లు భావిస్తున్నారు. తెలుగు కవిత్వానికి ఆయన చేసిన సేవలకు ఇది గౌరవ సూచకంగా నిలిచిందని పలువురు సాహిత్యవేత్తలు అభిప్రాయపడుతున్నారు.
నందిని సిధారెడ్డి తెలంగాణ రాష్ట్రంలోని సిద్దిపేట ప్రాంతంలో జన్మించారు. ఆయన 1955 జూన్ 12న జన్మించారు. ఆయన తండ్రి నర్రా బాలసిద్ధారెడ్డి స్వాతంత్ర్యోద్యమ కాలంలో రాజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన కమ్యూనిస్టు ఉద్యమకారుడు. తల్లి రత్నమాల. చిన్ననాటి నుంచి సాహిత్యం పట్ల ఆసక్తి కలిగిన సిధారెడ్డి తన విద్యాభ్యాసాన్ని సిద్దిపేటలో పూర్తి చేశారు. అనంతరం హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు సాహిత్యంలో ఉన్నత విద్యను అభ్యసించారు. అక్కడే ఎం.ఏ, ఎం.ఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేశారు.తరువాత ఆయన ప్రభుత్వ కళాశాలల్లో తెలుగు ఉపాధ్యాయుడిగా సేవలందించారు. మెదక్ మరియు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో తెలుగు లెక్చరర్‌గా పనిచేశారు. విద్యార్థులకు తెలుగు సాహిత్యం బోధించడంతో పాటు స్వయంగా కూడా సాహిత్య రచనలు కొనసాగించారు. 2012లో ఆయన ప్రభుత్వ సేవ నుంచి పదవీ విరమణ చేశారు. అయితే పదవీ విరమణ తర్వాత కూడా సాహిత్య రంగంలో ఆయన చురుకుగా కొనసాగుతున్నారు.
తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆయనకు మరో ముఖ్య బాధ్యత లభించింది. 2017లో తెలంగాణ ప్రభుత్వం ఆయనను తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్‌గా నియమించింది. ఆ బాధ్యతను ఆయన సమర్థవంతంగా నిర్వహించారు. తెలంగాణ సాహిత్య సంపదను ప్రోత్సహించడం, కొత్త రచయితలను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించారు.
నందిని సిధారెడ్డి రచనల్లో 'నాగేటి చాల్లల' అనే కవిత ప్రత్యేక ప్రాధాన్యం పొందింది. 1997లో వెలువడిన ఈ కవిత తెలంగాణ సంస్కృతి, గ్రామీణ జీవన విధానాన్ని ప్రతిబింబించేలా ఉండటంతో విస్తృతంగా ప్రాచుర్యం పొందింది. తరువాత అది పాట రూపంలో కూడా ప్రజల్లోకి వెళ్లి మరింత ఆదరణ పొందింది. ఈ రచన ద్వారా ఆయనకు విశేష గుర్తింపు వచ్చింది.
అదనంగా ఆయన భూమిస్వప్నం, ఇగురం, ఆవర్తనం, కుల వృత్తులు, ప్రాణహిత వంటి పలు రచనలు చేశారు. ఆయన కవిత్వం సామాజిక స్పృహతో కూడినదిగా ఉండటంతో పాటు తెలంగాణ భాషా శైలిని ప్రతిబింబిస్తుంది. గ్రామీణ జీవితంలోని వాస్తవాలు, సామాజిక సమస్యలు, ప్రజల భావోద్వేగాలు ఆయన కవితల్లో ప్రధానంగా కనిపిస్తాయి.
నందిని సిధారెడ్డి సాహిత్య సేవలకు గతంలో కూడా అనేక అవార్డులు లభించాయి. 2010లో 'నాగేటి చాల్లల' పాటకు ఉత్తమ గేయరచయితగా నంది అవార్డు అందుకున్నారు. 2001లో ఆయన రచించిన 'ప్రాణహిత' కవితా సంపుటికి తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం లభించింది. 1988లో ఆయనకు దాశరథి పురస్కారం కూడా లభించింది. ఇప్పుడు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించడం ఆయన సాహిత్య ప్రయాణంలో మరో ముఖ్య ఘట్టంగా నిలిచింది.
ఇక ఇతర భారతీయ భాషల్లో కూడా ప్రముఖ రచయితలు ఈ అవార్డులకు ఎంపికయ్యారు. అసోమీ భాషలో దేవబ్రత్ దాస్ రచించిన 'కర్బి ఖేలార్ సాధు' నవలకు అవార్డు లభించింది. బెంగాలీ భాషలో ప్రసూన్ బందోపాధ్యాయ రాసిన 'శ్రేష్ఠ కబిత' కవితా సంకలనానికి గుర్తింపు దక్కింది. బోడో భాషలో సహైసులి బ్రహ్మ రచించిన నవలకు అవార్డు ప్రకటించారు. డోగ్రీ భాషలో ఖజూర్ సింగ్ ఠాకూర్ కవితా రచనకు ఈ గౌరవం లభించింది.
ఇంగ్లీష్ భాషలో నవతేజ్ సర్నా రాసిన 'క్రిమ్సన్ స్ప్రింగ్' నవలకు అవార్డు లభించింది. గుజరాతీ భాషలో యోగేష్ వైద్య కవిత్వానికి గుర్తింపు దక్కింది. హిందీ భాషలో మమతా కాలియా రాసిన జ్ఞాపకాల గ్రంథం ఎంపికైంది. కన్నడ భాషలో అమరేష్ నుగడోని కథా సంకలనానికి అవార్డు లభించింది.
మలయాళం భాషలో ఎన్. ప్రభాకరన్ రచించిన 'మాయామానుష్యార్' నవల ఎంపిక కాగా, మరాఠీ భాషలో రాజు బావిస్కర్ రాసిన ఆత్మకథకు ఈ గౌరవం దక్కింది. తమిళ భాషలో సా. తమిళ్ సెల్వన్ రాసిన సాహిత్య విమర్శ గ్రంథం ఎంపికైంది. అలాగే ఉర్దూ భాషలో ప్రిత్పాల్ సింగ్ బేతాబ్ కవితా సంకలనానికి అవార్డు ప్రకటించారు.
ఇలా దేశంలోని విభిన్న భాషలలో సాహిత్య సృజనాత్మకతకు కేంద్ర సాహిత్య అకాడమీ గుర్తింపు ఇవ్వడం ద్వారా భారతీయ సాహిత్య సంపదను ప్రోత్సహించే ప్రయత్నం కొనసాగుతోంది. ప్రతి ఏడాది ఈ అవార్డుల కోసం దేశవ్యాప్తంగా రచయితలు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఈ అవార్డు పొందడం సాహిత్య రంగంలో అత్యంత గౌరవప్రదంగా భావిస్తారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2007/17174, CELL : 8008609999